ఈనాడు తూర్పుగోదావరి

ఆదివారం, జనవరి 28, 2018



## ప్రత్యేక కథనాలు

# బాల మేధా క్రియ

న్యూస్‌టుడే, గాంధీనగర్, కాకినాడ నగరం



నిత్యం కలం చేతబట్టే ఆ చేతులు కాళ్లకు గజ్జెకట్టాయి. పాఠాలు చదివే వారి నోట పంచ్ డైలాగులు పలికాయి. తరగతి గదిలో ఉండే ఆ చిట్టిబుర్రలు కళా వేదికపై తమ ప్రతిభకు పదును పెట్టాయి. చూపరులను ఆకట్టుకునేలా, ఆలోచింపజేసేలా సాగింది బాలల పండుగ క్రియ. సంప్రదాయ నృత్యాలు, వేషధారణలు, లఘునాటికలు, ఏక పాత్రాభినయాలు, ఒకటేమిటి ప్రతిభకు హద్దేముంది అన్నట్లు చిన్నారులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రేక్షకుల చేత శెభాష్ అనిపించుకున్నారు. ఈ వేడుకకు వేదికైన కాకినాడ విద్యార్థుల కేరింతలు, చిరునవ్వులతో మురిసింది, బాలల మదిలో నిలిచింది.

నటనలో నవరసాలు పలికిస్తూ సాగిన చిన్నారుల నాటికలు...జుంబారే అంటూ తమ జానపద నృత్యాలతో ఉర్రూతలూగిస్తూ సాగిన నృత్యాలు... తమలోని సృజనను పోస్టర్లుగా తయారుచేసి సాగించిన ప్రదర్శనలు....బాలమేధావుల సైన్సు ప్రయోగాల ప్రతిరూపాలు... ఇలా ఒకటి కాదు రెండుకాదు పదమూడు అంశాల్లో ఏడువేలమందికి పైగా చిన్నారులు సృజనకు పదునుపెట్టారు. కాకినాడ నగరంలోని జేఎన్‌టీయూకే ప్రాంగణంలో క్రియ పిల్లల పండుగ పేరిట రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను క్రియ స్వచ్ఛంద సేవా సంస్థ మూడేళ్లుగా నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి వేలమంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెంట రావడంతో జేఎన్‌టీయూకే ప్రాంగణం కిక్కిరిసింది. విభిన్న అంశాల్లో పిల్లల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించారు. జేఎన్‌టీయూకే ఆవరణలో వేరు వేరు చోట్ల ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు ఆయా అంశాల్లో అనుభవజ్ఞులైన నిష్ణాతులను న్యాయనిర్ణేతలుగా నియమించారు. నాటికలు, నృత్యం, సైన్సు ప్రయోగాలు, తెలుగులో మాట్లాడటం, నాటకీకరణ, క్విజ్ తదితర పోటీలను జూనియర్, సీనియర్, వ్యక్తిగతం, బృందాలుగా నిర్వహించారు.

### పసందైన విందు

క్రియ పిల్లల పండుగలో భాగంగా పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు నిర్వాహకులు పసందైన వంటకాలు వడ్డించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతోపాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వసతి సౌకర్యం కల్పించారు. మొదటిరోజు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రియ సంస్థ కార్యదర్శి జగన్నాథరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలిరోజు ముఖ్యఅతిథులుగా జనవిజ్ఞాన వేదిక జాతీయాధ్యక్షుడు వి.బ్రహ్మారెడ్డి, కొత్తగూడెం బాలోత్సవ్ కన్వీనర్ రమేష్‌బాబు, విజయవాడ బుక్‌ఫెస్టివల్ ప్రతినిధి వాసిరెడ్డి నవీన్, జేఎన్‌టియూకే ప్రిన్సిపల్ ప్రసాదరాజు, డీఈవో ఎస్.అబ్రహం విచ్చేశారు. ఇలాంటి కార్యక్రమాలు బాలల్లో మేధస్సు, తెలివితేటలు, నటనాశక్తి, సాంస్కృతికం, తదితర ప్రతిభను వెలికితీసేందుకు ఉపకరిస్తాయని, నిర్వాహకులను వారు అభినందించారు.









